క్లుప్తంగా

## రికార్డులు పరిశీలించిన డీపీవో వీరబుచ్చయ్య

శంకరపట్నం: కేంద్రపంచాయతీ అవార్డులపై డీపీవో వీరబుచ్చయ్య పలు గ్రామాల రికార్డులను పరిశీలించారు. మండలంలోని ధర్మారం, ముత్తారం, తాడికల్ గ్రామాల్లో మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గ్రామంలో చేసిన పనులు, తదితర విషయాలను తెలుసుకున్నారు. వెంట ఎంపీడీవో బషీరొద్దీన్, యూనిసెఫ్ కోఆర్డినేటర్ కిషన్‌స్వామి, డీటీఎం సంతోష్, కార్యదర్శులు జీవిత, సమ్మ రాజేశ్వర్, శ్రీనివాస్ ఉన్నారు.

## వైద్య శిబిరానికి స్పందన

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్, హాస్పిటల్ సహకారంతో రాపర్తి అఖిల్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామంలో 500 మందికి వివిధ రకాల పరీక్షల చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురికి శస్త్ర చికిత్స అవసరమని రెఫర్ చేశారు. వైద్యులు, ప్రతిమ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ రాజేందర్, ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధి వీరాస్వామి, సర్పంచ్ అనుష సతీష్‌గౌడ్, ఎంపీటీసీ రామచందర్, వార్డు సభ్యులు భిక్షపతి, ఆశ రమేష్, మొండయ్య, శ్రీనివాస్, రవి, రవీందర్, సాయి, సాయితేజ, మధుకర్, అనిల్, నాగర్జున పాల్గొన్నారు.

## డ్రైవర్ల సంబరాలు

శంకరపట్నం: కేశవపట్నంలో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం ట్రాలీ ఆటో యూనియన్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఏఎస్సై సుధాకర్ కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి, మాజీ సర్పంచ్ రాజకొంరయ్య,తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన తనిఖీ

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ గంప మల్లీశ్వరీ తనిఖీ చేశారు. వంటగదితో పాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం జరిగిన జాతీయ బాలికా దినోత్సవంలో పాల్గొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బాలికలకు చదువుతో పాటు సామాజిక విజ్ఞానం ఎంతో అవసరమన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్యామల భాగ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, శ్యామల, రాజేశ్వరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో నిరంతర ఆదాయం

హుజూరాబాద్‌రూరల్: ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులు నిరంతర ఆదాయం పొందుతారని మండల వ్యవసాయాధికారి సీహెచ్ సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులోని గొడిశాల శ్రీధర్ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పంటల సాగు చేపట్టాలని సూచించారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన నాలుగేళ్ల నుంచి ముప్పై ఏళ్ల వరకు ఆదాయం పొందుతారని తెలిపారు. చీడ పీడల బెడద తక్కువ ఉంటుందని, తక్కువ పనివారితో ఎక్కువ వ్యవసాయం చేయవచ్చన్నారు. అంతర పంటలు పండించవచ్చని, పంట మార్పిడిలో భాగంగా ఆయిల్‌పామ్ తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం రాయితీ ఇస్తుందని వివరించారు. వెంట ఏఈఓ ఉజ్మాత్ నిషాత్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ యాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్‌పీవో డైరెక్టర్ బద్దం రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

రామడుగు: పట్టణంలోని జ్ఞాన సరస్వతి దేవాలయంలో ఈ నెల 26న నిర్వహించనున్న వసంత పంచమి వేడుకల కరపత్రాన్ని రామడుగు సర్పంచ్ పంజాల ప్రమీలజగన్‌మోహన్‌గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. రామడుగు విన్నర్స్ ఇంగ్లిష్ మీడియం, చొప్పదండిలోని జ్ఞాన సరస్వతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మారెడ్డి, సంబోజీ శేఖర్, ప్రధాన అర్చకులు సింహాచలం జగన్మోహన్‌స్వామి, పలువురు పాల్గొన్నారు.

# పేరుకే మండల కేంద్రం

తిమ్మాపూర్: పేరుకు మండల కేంద్రం.. అభివృద్ధిలో మాత్రం తిమ్మాపూర్ చిన్న గ్రామ పంచాయతీలకంటే అధ్వానంగా ఉంది. జిల్లా కేంద్రానికి కేవలం పది కిలోమీటర్ల దూరంలో ఉన్నా నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వ్యాపార రంగాల్లో వేగంగా విస్తరిస్తోంది. పంచాయతీకి భారీగా ఆదాయం సమకూరుతున్నా అభివృద్ధి విషయంలో మాత్రం ఇంకా వెనుకంజలోనే ఉంది.



గుంతలమయంగా సుభాష్‌నగర్ - తిమ్మాపూర్ రోడ్డు

చిన్న గ్రామాల కంటే అభివృద్ధిలో తిమ్మా'పూర్'

జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరం

రోడ్డు విస్తరణ హామీ నెరవేరని వైనం

పూర్తిగా ధ్వంసమై దుమ్ములేస్తున్న సింగిల్‌రోడ్లు

### దశాబ్దాల క్రితం వేసినవే

ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రోడ్లు ప్రధానం. రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న తిమ్మాపూర్‌లో రోడ్లు మాత్రం దశాబ్దాల క్రితం వేసినవే. ఎన్నికల సమయంలో రోడ్లు వేయిస్తామని చెబుతున్న నేతలు గెలిచిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తిమ్మాపూర్‌కు రాజీవ్ రహదారి నుంచి, సుభాష్‌నగర్ స్టేజీ నుంచి రోడ్లు ఉన్నాయి. రెండూ సింగిల్ రోడ్లే, పంచాయతీలో సుమారు ఐదు వేల జనాభా, 900లకు పైగా ఇళ్లు ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం మండల వాసులు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తారు. చాలామంది రైతులు పండించిన కూరగాయలను జిల్లా కేంద్రానికి తీసుకెళ్లి విక్రయిస్తారు. ఏళ్ల నాటి సింగిల్ రోడ్డు నేటికీ విస్తరణకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం రహదారుల విస్తరణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నా తిమ్మాపూర్ రోడ్డుకు మాత్రం మోక్షం లభించడం లేదు.

### అడుగడుగునా గుంతలు..

తిమ్మాపూర్ మండల కేంద్రం సుభాష్‌నగర్ వరకు సుమారు1 కిలోమీటర్ దూరం. తిమ్మాపూర్-సుభాష్‌నగర్ వాసులు రోడ్డుమీదుగానే నిత్యం రాకపోకలు సాగిస్తారు. ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డు గుంతలమయమైంది. కంకర తేలి అధ్వానంగా తయారైనా మరమ్మతులు చేయడంలేదని ప్రజలు వాపోతున్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని డబుల్ రోడ్డుగా విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యం..

రోడ్డు విస్తరించాలని గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు పంచాయతీరాజ్‌శాఖ మంత్రికి వినతిపత్రాలు ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమస్యను సీఎం దృష్టికి కూడా తీసుకెళ్లారు. నిధులు మాత్రం మంజూరు కావడంలేదు.

### త్వరలో పనులు

తిమ్మాపూర్ స్టేజీ నుంచి మండల కేంద్రానికి సుమారు కిలోమీటరున్నర వరకు ఎమ్మార్‌ఆర్ గ్రాంట్ నుంచి బీటీ రోడ్డు రెన్యువల్‌కు రూ. 60 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీనికోసం టెండర్ కూడా నిర్వహిస్తున్నాం. త్వరలోనే పనులు మొదలుపెట్టి పూర్తి చేస్తాం.

– రవి ప్రసాద్, స్పెషల్ ఆఫీసర్



అధ్వానంగా మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు

### మోక్షం కలిగేదెన్నడో..!

డబుల్ రోడ్డు విస్తరణకు పనులు మొదలు కాకపోవడంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కనీసం అధికారులు టెండర్లు పిలిచి ఉంటే పనులు మొదలయ్యేవని అభిప్రాయపడుతున్నారు. రెండు రోడ్డులను ఆనుకునే పలువురు వెంచర్లు కూడా ఏర్పాటు చేశారు. నిత్యం రాకపోకలు కూడా ఎక్కువే. డబుల్ రోడ్డుపై ఆశలతో పలువురు రియల్టర్లు భారీ పెట్టుబడితో భూములు కొనుగోలు చేశారు. ఇప్పుడు రోడ్డు విస్తరణ పనులపై నీలినీడలు కమ్ముకోవడంతో ఆందోళన చెందుతున్నారు.

సమాచారం

## సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సునీల్

చొప్పదండి: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం చొప్పదండి పట్టణ కోఆర్డినేటర్‌గా సంబోజి సునీల్‌ను నియమించామని రాష్ట్ర కోఆర్డినేటర్ పట్టెం నవీన్ ప్రకటించారు. నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులకు సునీల్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జిగా శ్రీనివాస్

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలో మంగళవారం ఎంఆర్‌పీఎస్ మండల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష్యుడు మాతంగి రమేశ్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జిగా జిల్లెల శ్రీనివాస్‌ను నియమించామని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష్యుడు గాజుల రామన్న, అంబాల మధున్య, గాలిపెల్లి శ్రీనివాస్, ఎలుకపల్లి పోల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చెక్కులు పంపిణీ

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పంపిణీ చేస్తారని తహసీల్దార్ ముబీన్‌అహ్మద్ తెలిపారు. ముదిమానిక్యంలో ఆడపిల్లల పేరుమీద నాలుగువేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాలను ఎమ్మెల్యే అందిస్తారని, తానే సొంతంగా నగదు ఇస్తున్నట్లు సర్పంచ్ జక్కుల రవీందర్ పేర్కొన్నారు. అనంతరం చిగురుమామిడి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖలకు సంబంధించి అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీవో నర్సయ్య తెలిపారు.

# బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

హుజూరాబాద్: బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అనుమాండ్ల శోభారాణి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా సంక్షేమశాఖ, స్పందన సేవా సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. బాల్య వివాహాలతో అమ్మాయిల జీవితం దుర్భరంగా మారే అవకాశం ఉందన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అంతకుముందు ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎస్సై రాజన్న, ఇన్‌చార్జి సీడీపీవో తిరుమల మాట్లాడారు. ఇబ్బందులు, వేధింపులకు గురైతే 100, 1098 నంబర్లకు ఫోన్‌చేయాలని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి డీసీపీఓ శాంత, ఏఎస్‌ఐ రామ్మూర్తి, పాఠశాల ఇన్‌చార్జి ఏ.పుష్ప లీల, సోషల్ వర్కర్ రమేష్, చైల్డ్ లైన్ 1098 సభ్యుడు కుమారస్వామి, సూపర్‌వైజర్ తిరుమల, శివజ్యోతి, రాజు, తిరుపతి, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట (జమ్మికుంట)లోని కేజీబీవీలో వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రత్యేక అధికారి రమాదేవి మాట్లాడుతూ బాలికల పట్ల వివక్ష చూపొద్దని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ బాలికల విద్య కోసం గురుకుల, కేజీబీవీ పాఠశాలలు ఏర్పాటు చేస్తోందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తులసీదాస్, బుజునూరు పాఠశాల హెడ్‌మాస్టర్ పద్మడా. జగదీశ్వర్, సీఆర్‌పీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్షా సామగ్రి పంపిణీ చేస్తున్న శోభారాణి

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు రంగవల్లులు, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అనురాధ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత, ఉపాధ్యాయురాళ్ళు, విద్యార్థులు ఉన్నారు.

**చట్టాలపై అవగాహన ఉండాలి**

వీణవంక: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి డీవీ నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గన్ముక్ల మోడల్ స్కూల్‌లో పోక్సో చట్టంపై అవగాహన సదుస్సు నిర్వహించారు. డీ.వీనాగేశ్వర్‌రావు, జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి అలేఖ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 18 ఏళ్లలోపు బాలబాలికలను లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం పోక్సో చట్టం తీసుకువచ్చి కఠిన శిక్షలు విధించడం జరుగుతుందన్నారు. వేధింపులు ఎదురైనప్పుడు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు దృష్టికి తీసుకువస్తే న్యాయం జరుగుతుందన్నారు. విద్యార్థుల ఆశయాన్ని నెరవేర్చడం కోసం తల్లిదండ్రులు కృషి చేయాలని, ప్రభుత్వం బాలలకు కల్పిస్తున్న అవకాశాలు వినియోగించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. హుజూరాబాద్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ శ్రీనివాస్ రెడ్డి, అడ్వకేట్ శ్రీనివాస్, అరుణ్‌కుమార్, స్థానిక ఎస్ శేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని తీర్మానం

చొప్పదండి: చొప్పదండి మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఏర్పడే సమయంలో అప్పటి పంచాయతీ కార్యదర్శి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన కర్ర ఇనుము పారిశ్రామిక సహకార సంఘానికి చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరుతూ మంగళవారం మున్సిపాలిటీలో జరిగిన పాలకవర్గ సమావేశంలో మెజారిటీ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. చొప్పదండిని మున్సిపాలిటీగా చేయనున్నట్లు 2018లో ప్రభుత్వం ప్రకటించగానే పంచాయతీ కార్యదర్శి దస్తావేజు నంబర్ 3442 ద్వారా 2018 జూన్‌లో సర్వే నంబర్ 22/2లో ఫ్లాట్ నంబర్ 16ను చూపిస్తూ సంఘానికి రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ ఆధారం చేసుకని ఇటీవల పాఠశాల స్థలం ఆక్రమణకు యత్నించడంతో మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. పాఠశాల స్థలంలో ఓపెన్ జిం పనులు చేపట్టగా గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కేసు నమోదు వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి రిజిస్ట్రేషన్‌పై విమర్శలు రావడంతో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు దిద్దుబాట చర్యలు చేపట్టారు. సదరు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆరోవార్డు కౌన్సిలర్ ప్రతిపాదించగా మెజారిటీ సభ్యులు బలపరుస్తూ తీర్మానాన్ని కలెక్టర్‌కు పంపించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, టీపీఎస్ తిరుపతమ్మ, రాజేశం, రవిందర్, శ్రీధర్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## విద్యార్థినులు కరాటే నేర్చుకోవాలి

హుజూరాబాద్: ఆత్మరక్షణకు విద్యార్థినులు కరాటేను నేర్చుకోవాలని మండల విద్యాధికారి కేతిరి వెంకటనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్‌లో భాగంగా వారంలో రెండు కరాటే క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. బాలికలు అధికంగా ఉన్న పాఠశాలలకు అవకాశాన్ని కల్పించనున్నామని పేర్కొన్నారు. హెచ్‌ఎం ఉమాదేవి గ్లోబల్ షోటో కాన్ కరాటే డో ఇండియా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్కే జలీల్‌తో పాఠశాలలో కరాటే క్లాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ..కరాటే ఆవశ్యకతను పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి శివారెడ్డి, గంగాచారి, రాజిరెడ్డి, ఆంజనేయస్వామి, ఉమాదేవి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మనపల్లిలో రైతుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో మంగళవారం రైతులు నిరసన తెలిపారు. జెడ్పీ పాఠశాల పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 685లో దాదాపు 4 ఎకరాలను చదును చేస్తే వరి కల్లాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామపెద్దలు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, కలెక్టర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందించారు. ప్రతి సీజన్‌లో ధాన్యం ఆరబోసేందుకు ఎత్తుపల్లాలను చదును చేసేందుకు సర్పంచ్ భూంరెడ్డి, ఉపసర్పంచ్ పెంద్యాల శారదసదానందం, ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కత్తుల రమేశ్ నేతృత్వంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు ఉపక్రమించారు. గ్రామశివారులోని గ్రానైట్ తవ్వకంలో వెలువడిన పనికిరాని బండరాళ్లను చదును చేసే స్థలంలోకి తరలిస్తున్నారు. గమనించిన కొందరు జెడ్పీటీసీ గీకురు రవీందర్‌కు ఫిర్యాదు చేయగా బండరాళ్లు సరఫరా చేస్తే పైఅధికారులకు ఫిర్యాదు చేస్తానని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. దీంతో కాంట్రాక్టర్ చదును చేసే పనులు నిలిపివేశాడు. గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతుంటే జెడ్పీటీసీ జోక్యం చేసుకోవడం ఏంటని, అభివృద్ధికి సహకరించాల్సింది పోయి రైతులకు, గ్రామానికి అన్యాయం చేయడం సమంజసం కాదన్నారు. అవసరమైతే గ్రామానికి వచ్చి చేస్తున్న పని రైతులకు ఉపయోగపడేదా లేదా అనే విషయాన్ని పరిశీలించాలి కానీ కాంట్రాక్టర్‌ను బెదిరించడం ఏంటని ప్రశ్నించారు.

## 'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

హుజూరాబాద్: రెండో విడత కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని 23వ వార్డులో కౌన్సిలర్ మొలుగూరి స్రుజనపూర్ణచందర్ ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ పేదల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని తెలిపారు. కంటి వెలుగుతో అనేక మంది కంటి సమస్యలు దూరమవుతాయని పేర్కొన్నారు. అనంతరం కంటి పరీక్షలు చేసుకున్న లబ్ధిదారులకు కళ్లద్దాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల, మెడికల్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

మానకొండూర్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని రైతు సంఘాల నాయకుడు, ఓసి సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు. మంగళవారం మానకొండూరులో క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ దేహధారుడ్యానికి మేలు చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వన్నారం సర్పంచ్ పోలాడి కవితావంశీదర్‌రావు, ఉప సర్పంచ్ బుద్దుల తిరుపతి, నాయకులు సంపత్, గంగుల రవి తదితరులు పాల్గొన్నారు.

## పొలాన్ని దున్నేశాడు

రామడుగు: అరుగాలం కష్టపడి మూడెకరాల వరి పంట వేసిన రైతును ఆదిలోనే వైరస్ వెంటాడింది. దీంతో చేసేదేం లేక ఆ వరిని దున్నేసి మరోమారు సాగు చేసేందుకు సిద్ధపడ్డాడు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని కోరటపల్లి గ్రామానికి చెందిన రైతు లక్ష్మీకాంతారెడ్డి మూడెకరాల్లో వరి వేశాడు. పంటకు వేరుకుళ్లు రోగం సోకి పూర్తిగా పాడైపోయింది. దీంతో ఏమీ చేయలేక మళ్లీ నాటు వేయడానికి సిద్ధపడ్డాడు. పంట పొలాన్ని ఇలా దున్నేశాడు. వేరుకుళ్లు రోగం ఆ రైతుకు తీరని నష్టం మిగిల్చింది. దీంతో మళ్లీ పెట్టుబడి పెట్టి వరినారు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.



పంట పొలం పాడైపోవడంతో దున్నుతున్న రైతు లక్ష్మీకాంతరెడ్డి



ఆధ్యాత్మికం

**ఘనంగా మార్కండేయ జయంతి**



రామడుగు: పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

రామడుగు: మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో మంగళవారం శ్రీ భక్త మార్కొండయ జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి పల్లకిలో స్వామివారిని ఊరేగించారు. దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులురాజేశం, మునీందర్, ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, భూమయ్య, విష్ణు, ఎలగందుల రాజేశం, భైరీ వీరేశం గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోనిన మధురానగర్ గ్రామ చౌరస్తాలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జయంతి ఘనంగా నిర్వహించారు. పూజలు, అభిషేకం, ఊరేగింపు శోభాయమానంగా నిర్వహించారు. సంఘం నాయకులు ప్రసాద్, లక్ష్మీనారాయణ, చెన్నూరి శంకర్, ఇప్పలపల్లి నర్సయ్య, లక్ష్మీపతి, అంజయ్య, మధు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



గన్నేరువరంలో ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర

గన్నేరువరం: మండలకేంద్రంలోని శ్రీ మార్కండేయ శివ భక్తాలయ నాల్గో వార్షిక కోత్సవాలను పద్మశాలీ సంఘం సభ్యులు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు. ఎస్సై సురేందర్, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు లింగయ్య దర్శించుకోగా ఆలయ సభ్యులు సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సంఘం అధ్యక్షుడుఅంజయ్య, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రామకృష్ణ, బలరాం, బక్కయ్య, భాస్కర్, రవీందర్, శేఖర్, సుధాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

## చెక్కులు పంపిణీ

గంగాధర: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఇంటికి వచ్చిన ఎమ్మెల్యేను లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు.

**సీసీరోడ్డు పనులు ప్రారంభం**

రామడుగు: మండలంలోని రంగసాయిపల్లిలో రూ.35 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, సర్పంచ్ సాధు పద్మమునీందర్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, రుద్రారం ఎంపీటీసీ దేవికరాజశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ శ్యాంసుందర్‌గౌడ్, నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పిల్లలకు చేయూత



ఆటవస్తువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రావుల రమేశ్

తిమ్మాపూర్: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నుస్తులాపూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ చిన్నారులకు రూ.50 వేల విలువైన యూనిఫాం, టై, బెల్టులు, షూ, క్రీడా సామగ్రిని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ రావుల రమేశ్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్త తిరుపతి రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు తాజొద్దీన్, ఉపసర్పంచ్ బేతి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.